

# కథా సుగంధాలు - నాగరాజు గంధం



## దుప్పటి

కే.శే. నాగరాజు గంధం

**ప్రియా.. నీ ఒక్క నిశ్వాస చాలు అనాదిగా ఘనీభవించిన** నా హిమ హృదయ శిఖర స్ఫటికాన్ని కరిగించడానికి.. నిజం. నువ్వు ఈ అనంత శీతల వ్యాకుల నిరీక్షణాక్షణాల్లో ముఖమల్ దుప్పటిలా నన్నావరించే నీ ఊపిరి చాలునేననే అస్థిత్వపు నెగడుని వెచ్చగా వెలిగించడానికి''

సి.హెచ్.ఆర్.కె బాలు, ఐ.ఏ.ఎస్, సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, హ్యూమన్ రిసోర్స్ అండ్ డెవలప్‌మెంట్ మినిస్ట్రీ అన్న బోర్డ్ తాపడం చేయబడుందా తలుపుకి. న్యూఢిల్లీలో శాస్త్రీభవన్ అనబడే విశాలమైన బిల్డింగ్  మూడో అంతస్తు మొదట కారిడార్‌లో రెండో గదికి ముందుందా తలుపు - గది లోపల ఏసి పనిచేస్తున్నా వేడిగానే ఉన్నట్టు తోస్తోంది బాలుకి.

మళ్ళీ మోగింది ఫోను - ఒకింత అసహనంగా ఆ ఫోన్ వైపు చూశాడు బాలు. పావుగంటలో ఆరోసారి ఆ ఫోన్ మోగటం, అదెక్కడినుంచో ఊహించగలడతను. యూనియన్ గవర్నమెంట్‌లో చాలా కీలకమైన స్థానంలో ఉన్న ఓ కేంద్ర మంత్రి ప్రైవేట్ సెక్రటరీ నుంచి ఓ రెండు సార్లు మోగనిచ్చి రిసీవర్ తీసుకున్నాడు.

''హా బోలియే మల్ హోత్రాజీ'' తన కంఠంలో విసుగుని దాచుకునే ప్రయత్నం చేయలేదతను.

''మల్‌హోత్రాని కాదు మహానుభావా మహతిని''. తెలుగులో వినిపించిన భార్య గొంతు విని చిన్నగా చిరునవ్వాడు బాలు - ''ప్రొద్దుటి నుంచీ అదేపనిగా తినేస్తున్నాడు ఓ మినిష్టరు చెంచాగాడు. ఏదో యూనివర్శిటీ ఎఫైర్‌లో అవుట్ ఆఫ్ ది వే సాయం చేయమని. ఇందాకే గట్టిగా ఇచ్చేశాను. మళ్ళీ వాడే అయితే''

''కమాన్.. స్టేట్ కేడర్ లో ఉన్నంతకాలం ప్రెజర్సే కదా. ఢిల్లీ పోస్టింగ్ అంటే జస్ట్ కూలింగ్ పిరియడ్, నో టెన్షన్  జస్ట్ గ్లోరిఫైడ్ క్లరికల్ జాబ్ అన్నావ్. ఇక్కడ కూడా నువ్వు టెన్షన్ పడి జనాలకి టెన్షన్ తెప్పించటం తప్పదా?'' చిరుకోపంగా అంది మహతి.

''తప్పదు. ఐ.ఏ.ఎస్ అంటే ఎస్ బాస్ సర్వీసు కాదు ఎలావొకలా ఉద్యోగం చేయడానికి. నేనీ చదువు ఊరికే చదవలేదు. మహతీ నా చదువు వెనక ఓ తపన ఉంది. ఓ స్ఫూర్తి ఉంది. నేను ఆషామాషీగా ఇరవై ఐదేళ్ళు సర్వీసు చేయలేదు. ఇక ముందూ చేయలేను'' బాలు గొంతులో కదిలిన నిజాయితీతో కూడిన బాధని గుర్తించిందామె.

ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది మహతి. తన ఉద్యోగ నిర్వహణ పట్ల భర్తకున్న అమేయమయిన అంకిత భావం తెలుసామెకి.

"సారీ. ఐ డోంట్ మీన్ వాటై సెడ్. మర్చిపోయాను. కృష్ణమూర్తిగారట ఆంధ్రా నుంచి ఫోన్ చేశారు"

"కృష్ణమూర్తా? ఆంధ్రాలో ఎక్కడినుంచి?" తెలీకుండానే బాలు గొంతులో ఆతృత ధ్వనించింది.

"ఒక్క క్షణం.." అంటూ రాసుకున్న స్లిప్‌ని చూసి చదివింది - "కృష్ణమూర్తి, సర్పంచ్, ఫతేపేట"

ఫతేపేట అన్నపేరు వినగానే అప్రయత్నంగా నిటారుగా అయ్యాడు బాలు. ఫతేపేట.. కృష్ణమూర్తి అంత వరకూ అతన్ని ఆవరించి ఉన్న ఉద్యోగ నిర్వహణ, వృత్తి అతన్ని బాధ్యతల తాలూకూ బంధనాలు ఈ రెండు పేర్లు వినడంతోనే అతన్నుంచి విడివడిపొయ్యాయి. ఉన్న చోటు నుంచి హఠాత్తుగా అదృశ్యమై ఏవో జ్ఞాపకాల సుడుల మధ్య చిక్కుకున్నవాడిలా వణుకుతున్న స్వరంతో అడిగాడు.. "ఏం చెప్పాడు కృష్ణమూర్తి?"

"మిమ్మల్ని అర్జంట్‌గా ఫతేపేట రమ్మన్నాడు. ఎవరో తిరిగొచ్చారు. వాళ్ళకి ఒంట్లో బాగోలేదని, మొత్తానికి నిన్ను వెంటనే రమ్మని చెప్పాడు. ఒన్ మినిట్.." తను రాసుకున్న స్లిప్ చూసి చెప్పింది మహతి. "ఆ రోషన్ వచ్చింది అని చెప్పాడు. నిన్ను ఎంత త్వరగా.."

రోషన్ అన్న పేరు వినగానే, మహతి చెప్పే మరే మాటలు వినపడలేదు బాలూకి. ఓ శీతల మలయపవనం ఎకాఎకిని గుండెకి చుట్టుకుని క్షణకాలం ఘనీభవించి హిమచాపమై తన గుండెని పెళ్ళగించుకుని ఏవో స్మృతి తీరాలవైపు సాగిపోయిన భావన కలిగింది.

"నే వెంటనే బయలుదేరుతున్నాను మహతీ.. సూట్‌కేస్ సర్దుంచు" అని అనగలిగాడు బాలు.

సరిగ్గా గంటన్నర తర్వాత న్యూఢిల్లీ హైదరాబాద్ ఫ్లైట్‌లో ఉన్నాడతను. టేకాఫ్ అవ్వబొయ్యేముందు ఏర్ హోస్టెస్ గుర్తుచేసిందతనికి బెల్టు కట్టుకోమని.. "ఆర్ యు ఆల్‌రైట్ సర్?" అడిగిందామె.

అతను తన గుండెల మీదుగా ముఖాన్ని పరుచుకునేలా కప్పుకున్న బాగా చిరుగులున్న ఎర్ర రంగు ముఖమల్ దుప్పటిని తీస్తూ.. దుప్పటిని కళ్ళు కనపడేవరకూ కిందికి దించి అవునన్నట్లు తలపంకించాడు.

విమానం టేకాఫ్ అవుతున్న క్షణాల్లోనే బాలు మనసు ఏవో జ్ఞాపకాల అంబరాల్లోకి ప్రవహించింది.

***

మునిమాపు వేళ మామిడితోటంతా నిర్మానుష్యంగా ఉంది. చల్లగా వీస్తున్న గాలికి రెల్లుపొదలు ఊగుతున్నాయి. ఏదో ఒంటరి పిట్ట ఆగాగి కూస్తోంది. "ఇంకెంత సేపు మూర్తి?" విసుగ్గా అడిగాడు బాలు..

"ఇష్, మెదలకుండా కూర్చో టైముందిలే వచ్చేస్తుంది" తను కూర్చున్న భంగిమ నుంచి లవలేశమాత్రమైనా కదలకుండా నెమ్మదిగా చెప్పాడు కృష్ణమూర్తి - మరో రెండు నిముషాలు అసహనంగా గడిచాయి.

"అంత అందంగా ఉంటుందా?" కూర్చున్న చోటునే ఎండుపుల్లలు విరుస్తూ అడిగాడు బాలు.

"శబ్దాలు చెయ్యకు. చూస్తే కళ్ళు తిరిగి పడిపోతావ్. ముఖ్యంగా ఆ నడక.." మధ్యలోనే మాటలు ఆపేసి వీళ్ళు కూర్చున్న రెల్లుపొదలకి పది గజాల దూరంలో ఓ చిన్న పర్ణశాలలాంటి ఇంట్లోంచి కడవతో బైటకొస్తున్న ఆరడుగుల ఆడమనిషిని చూపించాడు కృష్ణమూర్తి - ఆమెని చూడగానే కృష్ణమూర్తి ముఖంలో కనిపించిన ఓ రకమైన విభ్రాంతి బాలుకి ఆశ్చర్యంగా తోచింది.

ఒక లిప్తపాటు 'ఏవిటీ మనిషి ఇంత ఎర్రగా ఉంది' అనుకుని.. మరుక్షణపు కదలికలో ఆ ఎరుపు ఆమెది కాదని.. భుజాలవరకూ ఆమె కప్పుకున్న ఎర్రటి ముఖమల్ దుప్పటిదని గ్రహించాడు బాలు.

ఆమె నడకలో స్త్రీ సహజమైన ఒద్దికలేదు. మరేదో రాచఠీవి.. ఒకలాంటి పొగరు. క్షణకాలం ఆమె మూర్తిత్వం ఎబ్బెట్టుగా తోచింది బాలుకి. ఘల్లు.. ఘల్లుమంటున్న గజ్జెల సవ్వడితో ఆమె దగ్గరవుతున్న కొద్దీ ఆమె ముఖం చూడాలన్న ఆతృతతో పైకిలేవబోయిన బాలుని బలంగా నివారించాడు కృష్ణమూర్తి.

వీళ్ళముందు నుంచీ నడుచుకెళ్ళిపోయిన ఆమె శరీరాకృతిలో తెల్లటి పాదాలు, చేతులు మాత్రమే చూడగలిగాడు బాలు. అలా నడిచి వెళ్ళిన ఆమె మరో పదిగజాల తర్వాత ఉన్న చిన్న కాలువలోకి దిగింది.

"అదేంటి కాలువలోకి దిగింది?"

"అరవకు వినపడుతుంది. నీళ్ళకోసం దిగింది. తిరిగి వచ్చేటప్పుడు ముఖం కనిపిస్తుంది. అదిరిపోతావ్" బాలుని కింద కూర్చోమని గుంజుతూ చెప్పాడు.

"నీ బొంద - ఏంట్రా అదిరేది. ఏం బాగుందిరా. గడబొంగంత ఎత్తు, తెల్లగా టి.బి.లాగా..తిరగేసిన బల్లిలాగా తెల్లగా.. నాకు డోకు ఆ రంగంటే. ఈ మాత్రం కోసం నా చేత రెండుగంటలు" అతని మాట పూర్తికాకుండానే కాలువలోంచి నీళ్ళ కడవతో సహా ఆమె బైటకొచ్చింది. దబుక్కున బాలుని కిందకు గుంజి కూర్చోపెట్టాడు కృష్ణమూర్తి - "ముఖం చూసి మాట్లాడు" అన్నాడు రహస్యంగా. దగ్గరగా వస్తున్న ఆమెని ఊపిరి బిగబట్టి చూశాడు బాలు.

ఈసారి ఆమె ముఖాన్ని మేలిముసుగు ఆక్రమించుకునే ఉంది. ఆమె వీళ్ళు కూర్చున్న పొదని దాటి వెడుతున్న క్షణాల్లో ఆమె ముఖాన్ని చూసి తీరాల్సిందేనన్న కోరిక ప్రబలిపోయింది బాలు మనసులో.. మరుక్షణం కృష్ణమూర్తి చెయ్యి విదిలించుకుని లేచాడు.

ఆ సవ్వడికి ఆగిందామె - వెనక్కి తిరిగి చూళ్ళేదు. క్షణం తర్వాత ఆమె అడుగు ముందుకు పడ్డది. "ఈ తిరగేసిన బల్లికోసమేనా ఊరు ఊరంతా తిరగబడిపోతుంది" అన్నాడు బాలు. దిగ్గున వెనక్కి తిరిగి తలెత్తి చూసిందామె. అంతే నడిరాత్రి సూర్యోదయమైనట్లయింది.

నల్లటి కురులు, విశాలమైన ఫాలభాగం. ఏ రమణీయ చిత్రకారుడో విల్లు ఒంపుని గీసినట్లున్న కనుబొమ్మలు, చిన్నవే ఐనా తీక్షణంగా కనిపిస్తున్న కళ్ళు, సన్నగా మొదలై హఠాత్తుగా ఆమె వ్యక్తిత్వపు స్థాయిని వెలువరించడానికన్నట్లు విస్తరించిన పొడవైన నాసిక.

అన్నింటినీ మించి కింద పెదవికన్నా ఒకింత పెద్దదేమో అనిపిస్తున్న పై పెదవి, మొత్తం ముఖాకృతిని కోలగా నిర్దేశిస్తున్న పొడవైన గడ్డం - వీటన్నిటి కలగలుపుతో ఏదో చిత్రమైన ఆకర్షణ, ఏదో అద్భుతమైన అద్భుతమైన అర్థం అయ్యీ అవ్వని సౌందర్య చిత్రలేఖన తోచింది బాలుకి ఆమె ముఖంలో. స్థబ్దుగా ఆమె సౌందర్య రశ్మిలో తడుస్తూండిపోయాడు బాలు. తనవైపే తదేకంగా చూస్తున్న బాలుని తీక్షణంగా గమనించిందామె ఒక్కక్షణం.

మరుక్షణం ఆమె చూపులు రెల్లు పొదల మధ్య నక్కి దాక్కున్న కృష్ణమూర్తి మీద పడింది. చేతిలో కడవని పక్కన పెట్టి తను కప్పుకున్న దుప్పటి చాటు నుంచి పాతకాలం నాటి నాటు తుపాకి తీసింది. అది చూసిన మరుక్షణం కృష్ణమూర్తి పులిని చూసిన లేడిపిల్లలా తోటకడ్డం పడి పరుగెత్తాడు. బాలులో చలనం లేదు.

ఆమె ముఖం మీదనుంచి అతని చూపులు తిరగలేదు. అతని కళ్ళకి ఆమె ముఖం తప్ప ఏమీ కనపడటం లేదు. రెండడుగులు అతనికి దగ్గరగా వేసి "ఊరికి కొత్తా?" అనడిగింది. అవునన్నట్లు తలూపాడు. "నీ పేరేంటి?" గొంతులో తీక్షణత్వం తగ్గకుండా అడిగింది.

"బాలు" అన్నాడు ఆమెనే చూస్తూ.

ఒక్కసారి నఖశిఖ పర్యంతం అతన్ని చూసిందామె. "ఉమర్ కితనా హై తేరా?" ఈసారి ఆమె గొంతులో తీక్షణత రేఖా మాత్రంగా తగ్గింది.

"ఆ ప్రశ్న అర్థం చేసుకుంటానికి ఓ రెండు క్షణాలు పట్టింది బాలుకి.. "పద్దెనిమిదేళ్ళు".

"బచ్చాహై.. బచ్చా" అప్రయత్నంగా ఓ చిన్న దరహాసం మెరిసిందామె ముఖంలో. ఒక్కసారి తన చేతుల్ని చూసుకుంది. "తిరగేసిన బల్లి ఈ రంగులో ఉంటుందా బద్మాష్ నికల్ యహాసే.. కభీమత్ ఆనా.. వచ్చావో.."

తన చేతిలో తుపాకి చూపించింది. నేల మీదుంచిన కడవ తీసుకుని వెనక్కి తిరిగి వెళ్ళిపోయిందామె.

అలా వెళ్తున్న ఆమెని పిలుద్దామనుకున్న బాలుకి ఎంత ప్రయత్నించినా మూర్తి చెప్పిన ఆమె పేరు గుర్తుకు రాలేదు. ఆమె పూర్తిగా కనుమరుగైన మరుక్షణం అతనికి ఆమె పేరు గుర్తొచ్చింది - అప్రయత్నంగా అతని పెదవులు ఆ పేరుని ఉచ్చరించాయి - రోషన్...

"రోషన్.. రోషన్.. రోషన్.. చంపుతున్నావ్ బాలు. రెండు రోజులనుంచి ఆ తోట చుట్టే తిప్పుతున్నావ్. పొరపాటున చూస్తే పిట్టల్ని కాల్చినట్టు నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేస్తుంది" అన్నాడు కృష్ణమూర్తి.

"అంటే.. ఆ తోటలో తను ఒంటరిగా ఉంటుందా?"

"ఖాన్ బాబా పోయిందగ్గరనుంచీ ఒంటరిగానే ఉంటోంది" అన్నాడు కృష్ణమూర్తి.

"ఖాన్‌బాబా అంటే రోషన్‌కి మొగుడా?"

తల అడ్డంగా ఊపాడు కృష్ణమూర్తి. "నువ్వు మా ఊరికి కొత్త.. రోషన్ ఎవరో ఏంటో చెప్పాలంటే మొదటి నుంచి చెప్పాలి. మా ఊరి పేరు ఫతేపేట. స్వాతంత్ర్యం రావడానికి పూర్వం ఇది నిజాం పాలనలో ఉండేది. అప్పుడీ ఊరికి సుబేదార్లు ఖాన్ బాబా పూర్వీకులు. అసలీ ఊరిపేరు కూడా వాళ్ళ పూర్వీకులనుంచి వచ్చిందే

నిజాం జమానా పోయింది. ఖాన్‌బాబా వైభవం కూడా వైభవం కూడా క్రమంగా కొడిగట్టింది. ఒకప్పటి రసికతకి గుర్తుగా చాలా మంది ఆడవాళ్ళు అతని ఇలాకాలో ఉండేవాళ్ళు. కాలక్రమేణా ఎవరిదారి వాళ్ళు చూసుకున్నారు. ఒక్క రోషన్ తప్ప. చిన్నపిల్లగా ఉన్నప్పుడే ఆమెని తన ఇలాకాలోకి తెచ్చుకున్నాడు ఖాన్ బాబా. బహుశా పరువానికొచ్చాక అనుభవిద్దామన్న కోరికతో కావచ్చు.

రోషన్ ఈడేరేటప్పటికే ఖాన్‌బాబా పరిస్థితి చేజారిపోయింది. మంచానపడ్డాడు. నా అనుకున్న వాళ్ళందరూ ముఖం తప్పించారు. కానీ రోషన్ మాత్రం అతన్ని వదల్లేదు. ఒకప్పుడు ఈ ఊళ్ళో పొలాలన్నీ ఖాన్ బాబావే. క్రమంగా అమ్ముతూ వచ్చాడు. ఇప్పుడు వాళ్ళున్న తోటని పోయిన సంక్రాంతికే అమ్మేశాడు. కొన్నది మీ బావే. అదమ్మేసిన రెండు నెలలకే ఖాన్ చనిపోయాడు. రోషన్ ఒక్కత్తిగా ఉండిపోయింది - ఎవరితో మాట్లాడదు. ఏం తెచ్చుకుంటుందో ఏం తింటుందో ఎవ్వరికీ తెలీదు."

"తోట మాకమ్మేసిన తర్వాత అందులో ఆమె ఎలా ఉంటోంది?" అడిగాడు బాలు.

"అందులో తిరకాసు ఉంది. ఇప్పుడు తనుంటున్న ఇల్లు కాలువకు వెళ్ళే కాలిబాట మినహాయించే ఖాన్ బాబా ఆ తోట మీ బావకి అమ్మాడు. ముసలాడు పొయ్యాక ఈ ఒంటిది ఏం ఉంటుందిలే అనుకున్నాడు మీ బావ. కానీ ఉంది. ఊళ్ళో మగాళ్ళు సాయం చేద్దామనుకున్నారు. పాపం అందరికీ దాదాపుగా మూతులు పగిలినయ్"

"అంటే?" అర్థంకాక అడిగాడు బాలు.

కిసుక్కున నవ్వాడు కృష్ణమూర్తి. "ఏం చెప్పను బాలు ఎవరి సంగతో ఎందుకు? మీ బావనే తీసుకో. రాత్రిళ్ళు ఆ కాలువలో స్నానం చేస్తుంది రోషన్. ఆ సంగతి తెలిసి ఏదో కెలకబొయ్యాడు. మూతి పగిలింది. వారం రోజులు మూతికి గుడ్డకట్టుకు తిరిగాడు. ఎవడైనా సరే మగ గాలిని పక్కకి రానీయదు. సివంగి" అన్నాడు.

కృష్ణమూర్తి మాటలు వింటూనే ఆలోచనలలోకి వెళ్ళిపోయాడు బాలు. "ఈ రోజు పౌర్ణమి కదూ" తనలో తనే అనుకున్నట్టుగా బయటకే అన్నా, తోటలో కాలువ గట్టు మీద ఉన్న మామిడి చెట్టు, కాలువమీదకి పరుచుకున్న కొమ్మలు బాలు మనస్సులో మెదిలాయి.

తన వెన్నెల పహరాతో తోటని పాలిస్తున్నట్టు మెరిసి పోతున్నాడు చంద్రుడు. చెట్టుకొమ్మలపై ఇరికి కూర్చున్నాడు బాలు. కాలువ మీదకు పరుచుకున్న చెట్టుకొమ్మల మీదకి అతనెక్కి రెండు గంటలు దాటింది.

వెన్నెల వెలుగులో కాలువ స్పష్టంగా కనిపిస్తోంది.

స్వచ్ఛంగా మెరుస్తూ తమలోకి ఇంకుతున్న వెన్నెల కిరణాలను మరింత దేదీప్యమానంగా మార్చి పరావర్తనం చెందిస్తున్న నీళ్ళు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

చీమ చిటుక్కుమన్నా ఆత్రుతగా చూస్తున్నాడు బాలు. అతని సుదీర్ఘ నిరీక్షణ ముగిసిన గుర్తుగా.. కాలువగట్టు దగ్గరకొచ్చింది రోషన్. ఒక్కసారి చుట్టూ చూసి బలంగా ఒళ్ళు విరుచుకుని తను చుట్టుకున్న దుప్పటి తీసి కాలువ గట్టునే వదిలేసింది. కాలువలోకి దిగబోతూ నడుముకున్న తోలు పట్టకాని అందులోని నాటు తుపాకిని గట్టుమీద పెట్టింది. తలెత్తి ఆకాశంలోకి చూసింది.

బాలు గుండెలు గుబగుబలాడినాయ్. ఊపిరి బిగపట్టి ఆమెవైపే చూస్తుండిపోయాడు.

అలా ఆకాశంలోకి చూసి మరుక్షణం తన బ్లౌజ్ హుక్స్ తీయడం ప్రారంభించిందామె.

ఒంట్లో ఉన్న రక్తమంతా ముఖంలోకి తోచుకొచ్చినట్లయింది బాలుకి. హుక్స్ తీయడం అయ్యాక బ్లౌజ్ అంచులు పట్టుకుని ఒక్కసారిగా లాగింది.

బ్లౌజ్, బ్రా విప్పేశాక చివరగా చీర కుచ్చెళ్ళు తీయబోతున్న క్షణంలో శరసంధానం చేసే ముందు ఎక్కు పెట్టిన మన్మథ వింటిలా తోచింది. ఆ సౌందర్యానుభూతి అతని గుండెల్ని ఆవిరి చేస్తోంది. అతను పూర్తిగా చెమటతో తడిసి ముద్దయిపొయ్యాడు. ఆ కాలువగట్టుమీద వెన్నెల మాధుర్యాన్ని అనుభవించటానికన్నట్లు ఒక్క నిముషం వెల్లకిలా పడుకుంది రోషన్.

గట్టుమీద పరుచుకున్న నల్లటి కురులు అరమోడ్పులైన కనులు. వెన్నెల క్రీనీడలో పొడుగ్గా సాగినట్టున్న గడ్డం. నిటారుగా ఎంతసేపని నిలుస్తాం అంటూ విశ్రాంతిగా చెరోవైపు వాలిన పర్వత శికరాల్లాంటి వక్షద్వయం. గుండ్రటి నాభిని కొట్టొచ్చినట్టు చూపిస్తున్న పల్చటి పొత్తి కడుపు. అంతవరకు ముడుచుకున్న కాళ్ళని ఆమె విశ్రాంతిగా ఎడం చేయబోయేంతలో..

చెట్టుకొమ్మల్ని బిగించి పట్టుకున్న బాలు అరచేతులు ఒక్కసారిగా పట్టుతప్పి, తల కిందులుగా కాలవలో పడ్డాడు. పెద్ద శబ్దంతో ఎవరో నీళ్ళలో పడటంతో ఒక్కసారిగా తత్తరపడింది రోషన్. పడ్డచోటు నుంచి బుడగలు రావడం మినహా మరేవిధమైన కదలిక లేకపోవడంతో పడ్డ మనిషికి ఈతరాదని గ్రహించిందామె.

మరో ఆలోచన లేకుండా నగ్నంగా నీళ్ళల్లోకి దూకిందామె. ఓ రెండు ప్రయత్నాల తర్వాత బాలు జుట్టు ఆమె చేతికి తగిలింది. ఒక్క విసురుతో గట్టుమీదకి చేర్చింది. వెన్నెల వెలుగులో అతన్ని గుర్తుపట్టింది.

అతని దుస్తులు వదులు చేసి పొత్తి కడుపు మీద ఒత్తి నీళ్ళు కక్కించింది. అప్పటికీ చలనంలేని అతన్ని క్షణకాలం సంశయంగా చూసి బలంగా ఊపిరి పీల్చుకుని తనపెదవుల్ని అతని పెదవుల లోపలగా ఉంచి గట్టిగా నోటితో గాలి ఊదింది. అలా ఆమె ఊపిరితిత్తుల నుంచీ వేడిగా ప్రవహించిన ఆమె ఊపిరి అతని శరీరాంతర్భాగాలని స్పర్శించి ఏ అనంత సుషుప్తికో జారిపోతున్న అతని జీవధాతువుని తిరిగి చైతన్యపరిచింది.

అతను చేతనుడయ్యాడు. అయాచితంగా అందిపుచ్చిన ఆమె లలితాధరామృత సేవనం అతన్ని అమరుణ్ణి చేసింది. తన నుదిటిని, గడ్డాన్ని స్పర్శిస్తున్న ఆమె పాలిండ్ల మృదుత్వం అతని మెలుకవని ఉద్విగ్నపూరితం చేసింది అప్రయత్నంగా అతని రెండు చేతులూ ఆమె నడుముని బలంగా చుట్టేశాయి. ఏం జరుగుతుందో తెలిసేసరికే అతడామెని మొత్తంగా బంధించేశాడు.

ప్రతిఘటించే ప్రయత్నంలో రోషన్ మళ్ళీ నీళ్ళలోకి జారబోయిన అతన్ని అప్రయత్నంగానే మీదకి లాక్కుంది. ఆ క్షణం ఆమెలో స్త్రీత్వం చిగురించింది.

ఆమె ఆలింగనం అతడ్ని అనంతానందతీరాలకు చేరవేసింది. కొద్ది నిముషాల తర్వాత నగ్నంగానే గట్టుమీద కూర్చుంది రోషన్. తలని రెండు మోకాళ్ళ మధ్య దాచుకుంది మాట్లాడే ధైర్యం చేయలేకపోయాడు బాలు. ఒక్క నిమిషం ఆగి గట్టుమీద ఉన్న తోలు పట్టకాలోని నాటు పిస్తోలు తెచ్చి ఆమె చేతిలో పెట్టాడు. ఆ తుపాకిని, అతన్ని మార్చి మార్చి చూసింది రోషన్.

"తప్పే కాల్చిపారేయ్.." తలవంచుకుని అన్నాడు బాలు. అతని ముఖాన్ని చూసి చిన్నగా నవ్వింది రోషన్. ఆ నవ్వు క్రమంగా ఎక్కువైంది. ఒక్కసారిగా అతన్ని పొదవిపట్టుకుని తనలోకి ఇముడ్చుకుంది. మరుక్షణం ఆమె నవ్వు దుఃఖంగా మారిపోయింది.

"చేసిందంతా చేసి కాల్చమంటావేరా బద్మాష్" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ. కొద్దిక్షణాలాగి తనే అంది. "ఈ తిరగేసిన బల్లి ఎలానచ్చిందిరా నీకు?"

జవాబుగా ఆమె మెడవంపులో ముద్దుపెట్టుకున్నాడు బాలు. ఆ రాత్రి వాళ్ళ మధ్య ఎన్నో ఊసులు, మరెన్నో బాసలు అలా కొన్నిరాత్రులు గడిచిన తరువాత ఒకరోజు హఠాత్తుగా అడిగింది రోషన్. "అవును బద్మాష్, నువ్వెప్పుడూ ఇలా నా చుట్టే తిరుగుతుంటావ్ సెలవలయ్యాయికదా మళ్ళీ చదువుకి వెళ్ళవా?" అని.

కొద్దిసేపు నిశ్శబ్దం తర్వాత చెప్పాడు బాలు - "ఇంక చదువుకోను. నిన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళను"

తదేకంగా బాలువైపు చూసింది రోషన్ - "అచ్ఛా జహాపనా మీ ఇష్టం" అంది నవ్వుతూ.

ఆ రాత్రి అతన్ని సాగనంపుతూ తన ఎర్రటి ముఖమల్ దుప్పటి కప్పి - "బాగా చలిగా ఉంది మళ్ళీ నా దగ్గర కొచ్చినప్పుడు తెచ్చివ్వు" అంది.

ఆ మర్నాడు రోషన్ బాలుకి కనపడలేదు. తోటలో, ఇంట్లో ఎక్కడా కనపడలేదు. ఇంటి తలుపుమీద మాత్రం వంకర టింకర అక్షరాలతో ఒక వాక్యం మాత్రం కనిపించింది - 'బాగా చదివి సుబేదార్ కారా బద్మాష్. అప్పుడే రోషన్ నీక్కనిపిస్తుంది - నా దుప్పటి జాగ్రత్త' - ఆ క్షణం అర్ధంకాకపోయినా తర్వాత కలంలో రోషన్ చేసిన మహోపకారం ఏంటో అర్ధమైంది బాలుకి.

ఆమె కోసం తనకు సాధ్యమైనన్ని చోట్ల వాకబు చేయించాడు. ఎమ్మే యూనివర్సిటీ ఫస్టు వచ్చాక సివిల్స్‌లో ఐఏఎస్ క్లియర్ చేసిన తర్వాత గుజరాత్ కేడర్‌లో చేరిపోయాడు బాలు. ప్రతి సంవత్సరం కృష్ణమూర్తి చేత వాకబు చేయిస్తూనే వచ్చాడు రోషన్ గురించి. ఇప్పుడూ తను చెప్పినట్టుగానే రోషన్ మళ్ళీ.

●●●

"ప్రాణం పోయుంటుందండీ" అన్నారెవరో.

"పొద్దున కూడా కళ్ళుతెరిచి చూసింది. మాటలేదులేగాని సైగ చేసింది నీకోసం.. ప్చ్! ఆఖరి చూపు దొరికితే బాగుండేది" బాధగా అన్నాడు కృష్ణమూర్తి.

ఏమాత్రం కదలికలేని రోషన్ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు బాలు. కుడిచేతిమీద పచ్చబొట్టు 'బాలు' అని. అతని కళ్ళవెంట నీళ్ళు తిరిగాయ్. డగ్గుత్తిక పడింది. ఏమనాలో అర్ధంకాక ఆమె మీదకి వంగాడు. అతని ఊపిరి ఆమె పాలభాగాన్ని తాకింది. అతికష్టం మీద గొంతు పెగల్చుకుని "రోషన్" అని పిలిచాడు.

మరుక్షణం ఆమెలో ఏదో కదలిక. కనురెప్పలు తెరవడానికి ముందు కనుగుడ్లు చేసే అలజడి నెమ్మదిగా కళ్ళు తెరిచిందామె. ఆమె కళ్ళకి మొదటగా కనిపించింది ఎర్రటి ముఖమల్ దుప్పటి. దాని చాటు నుంచి క్రమంగా స్పష్టపడ్డాడు. బాలు కళ్ళనిండా నీళ్ళతో.

అతని ముఖాన్ని ఆనందంగా, సంతృప్తిగా చూసుకుందామె. అక్కడక్కడ తెల్లబడ్డ వెంట్రుకల్ని చూడగానే ఆమె ముఖంలో ఓ దరహాసం మెరిసింది.

"అబ్ కి తనా ఉమర్ హైరే తేరా బద్మాష్" కూడబలుక్కున్నట్టు అన్నా స్పష్టంగానే అడిగింది. కన్నీళ్ళు తుడుచుకుని "నలభై తొమ్మిది" అన్నాడు బాలు.

"ఇంకా నువ్వు చిన్నపిల్లాడివేరా.. అభీ భీ తు బచ్చాహై" తన నిరీక్షణ ముగిసినట్లు కళ్ళుమూసుకుంది రోషన్.

●●●

Click here to share your comments on this story